సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి భక్తుల రాక మొదలైంది. అన్ని విభాగాలూ భక్తులతో కిటకిటలాడాయి.



అనుమానంతోనే చంపేశాడు

ముసునూరు మండలం చిల్లబోయినపల్లి గ్రామంలో మహిళ హత్య కేసులో నిందితుడైన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. IIలో ▸



వాండ్రంలో ఉద్రిక్తత

వాండ్రం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ కె.శ్రీనాథ్ గ్రామస్తులతో చర్చించి శాంతి కమిటీని ఏర్పాటుచేశారు. IIలో ▸

పంచాయతీల్లో ఫ్యాన్ హవా

- నాలుగు సర్పంచ్ స్థానాలు వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కైవసం
- వీరమ్మకుంటలో హోరాహోరీ పోరులో పైచేయి
- ఏలూరు జిల్లాలో 81.71 శాతం, 'పశ్చిమ'లో 79.20 శాతం పోలింగ్
- ఏలూరు జిల్లాలో 45 వార్డులకు 31 స్థానాలు కైవసం



ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



వీరమ్మకుంటలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గెలుపొందగా విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

సాక్షిప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన పంచాయతీ పోరులో వైఎస్సార్ సీపీ సత్తాచాటింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పార్టీ మద్దతుదారులు మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్నారు. రెండు జిల్లాల్లో 4 సర్పంచ్ స్థానాలు, 57 వార్డు మెంబర్ల స్థానాలకు శనివారం పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు ప్రశాంతంగా ముగిశాయి. 80 శాతానికిపైగా వార్డు మెంబర్ల స్థానాలను, 90 శాతానికి పైగా సర్పంచుల స్థానాలను అధికార వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కైవసం చేసుకుని ఉమ్మడి జిల్లాలో మరోసారి బలీయమైన శక్తిగా సత్తాచాటారు.

నాలుగు స్థానాలూ వైఎస్సార్ సీపీకే..

ఏలూరు జిల్లాలో నాలుగు సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. కాగా ఎన్నికలు నిర్వహించిన మిగిలిన మూడు స్థానాలను వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. వీటిలో పెదపాడు మండలం వీరమ్మకుంటలో జరిగిన ఎన్నికల్లో హోరాహోరీ పోరు సాగింది. ఈ పోరులో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి మరడాని వెంకట లక్ష్మణ సోమేశ్వరరావు తన సమీప ప్రత్యర్థి, టీడీపీ మద్దతుదారుపై 286 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అలాగే ముదినేపల్లి మండలం వణుదురు సర్పంచ్ స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి చిన్నం సుగుణబాబు తన సమీప ప్రత్యర్థిపై 444 ఓట్ల మెజార్టీ సాధించారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామ సర్పంచ్‌కు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి వేము రాజు తన సమీప ప్రత్యర్థిపై 322 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

దెందులూరు నియోజకవర్గంలో 14 వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు జరగ్గా 10 స్థానాలను వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, 4 స్థానాలను టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ద్వారకాతిరుమల మండలంలో రెండు స్థానాలకు గాను రెండింటిని, చింతలపూడి నియోజకవర్గంలో నాలుగు స్థానాలకు నాలుగింటిని వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గెలుపొందారు. కైకలూరు నియోజకవర్గంలో నాలుగు స్థానాలకు ఒకటి వైఎస్సార్ సీపీ, మూడు టీడీపీ, నూజివీడు నియోజకవర్గంలో ఏడు స్థానాలకు ఐదు వైఎస్సార్ సీపీ, 2 టీడీపీ, పోలవరం నియోజకవర్గంలో 6 స్థానాలకు 4 వైఎస్సార్ సీపీ, ఒకటి టీడీపీ మద్దతుదారులు, ఒకటి ఇతరులు దక్కించుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 8 స్థానాలకు 5 వైఎస్సార్ సీపీ, 2 టీడీపీ, ఒకటి జనసేన మద్దతుదారులు గెలుపొందారు.

81.71 శాతం పోలింగ్

ఏలూరు జిల్లాలో చిన్నపాటి సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సర్పంచ్, వార్డు సభ్యులకు గాను ఖాళీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా ఏకగ్రీవాలు, సింగిల్ నామినేషన్ల దాఖలు వల్ల 33 పోలింగ్ కేంద్రాల్లో 3 సర్పంచులకు, 21 వార్డు సభ్యులకు అధికారులు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడంతో 81.71 శాతం పోలింగ్ నమోదైంది. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



వీరమ్మకుంటలో బారులు తీరిన ఓటర్లు

పశ్చిమగోదావరిలో..

పశ్చిమగోదావరి జిల్లాలో ఒక సర్పంచ్, 10 వార్డు మెంబర్ల పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 79.20 శాతం పోలింగ్ నమోదైంది. మూడు సర్పంచ్ పదవులు ఖాళీ కాగా నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటిలో రెండు ఏకగ్రీవం కాగా.. ఇరగవరం మండలం కావలిపురం సర్పంచ్ పదవికి ఎన్నిక జరిగింది. ఇక్కడ టీడీపీ మద్దతుదారు గెలుపొందారు. అలాగే 10 వార్డు మెంబర్లకు పోలింగ్ జరగ్గా ఆరు స్థానాల్లో వైఎస్సార్ సీపీ, నాలుగు స్థానాల్లో టీడీపీ మద్దతుదారులు విజయం సాధించారు. నియోజకవర్గాల వారీగా పాలకొల్లులో రెండు స్థానాలకు రెండు, ఆచంటలో రెండు స్థానాలకు ఒకటి, భీమవరంలో ఒక స్థానానికి ఒకటి, తణుకులో రెండు స్థానాలకు ఒకటి, ఉంగుటూరులో ఒక స్థానానికి ఒకటి వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గెలుపొందారు.

'పశ్చిమ'లో ప్రశాంతంగా పోలింగ్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఒక సర్పంచ్, పది వార్డు మెంబర్ల పదవులకు నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, 79.20 శాతం పోలింగ్ నమోదైనట్లు కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇరగవరం మండలం కావలిపురం, పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల పంచాయతీల సర్పంచ్ పదవులకు, 28వ వార్డు మెంబర్ల స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. వీరవాసరం మండలం మెంటేపూడి, ఉండి మండలం కలిసిపూడి, ఆకివీడు మండలం కుప్పనపూడి 2, 7 వార్డులు, అజ్జమూరు, ఇరగవరం మండలం కావలిపురం, పెనుమంట్ర మండలం వెలగలేరు, తణుకు మండలం ముద్దాపురం, తాడేపల్లిగూడెం మండలం కృష్ణయ్యపాలెం, వీరంపాలెం, పోడూరు మండలం కొమ్ముచిక్కాల, పాలకొల్లు మండలం వెలివెల, దిగమర్రు, దగ్గులూరు, పెంటపాడు మండలం చింతపల్లి, నరసాపురం మండలం కే.బేతపూడి, తూర్పుతాళ్ల, యలమంచిలి మండలం కాంబోట్లపాలెం వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయని పేర్కొన్నారు.



ఇరగవరం మండలం కావలిపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

1 సర్పంచ్.. 10 వార్డు స్థానాల్లో పోలింగ్

ఇరగవరం మండలం కావలిపురం సర్పంచ్ పదవికి, వీరవాసరం మండలం మత్స్యపురి, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, పెనుగొండ మండలం దొంగరావిపాలెం, ఇరగవరం మండలం గోటేరు, పెనుమంట్ర మండలం మార్టేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం గోరింటాడ, చింతపర్రు, పెంటపాడు మండలం కస్పా పెంటపాడు, గణపవరంలో మొత్తం 10 వార్డు స్థానాలకు శనివారం పోలింగ్ నిర్వహించినట్టు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ బడుల్లో లయన్స్ క్వెస్ట్ పాఠాలు



కలెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్సీ వంక

సాక్షి, భీమవరం: విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, సమస్యలను ఎదుర్కొనే చాకచక్యం, తల్లిదండ్రులపై బాధ్యత, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా లయన్స్ క్వెస్ట్ పాఠాలను ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే విధానంపై ఎమ్మెల్సీ, లయన్స్ మల్టీపుల్ చైర్‌పర్సన్ వంక రవీంద్రనాథ్ శనివారం కలెక్టర్ పి.ప్రశాంతితో చర్చించారు. భీమవరం కలెక్టరేట్‌లో లయన్స్ క్లబ్ తయారు చేసిన పాఠ్యాంశాలను కలెక్టర్‌కు వివరించారు. త్వరలో జిల్లాలోని మూడు సెంటర్లలో టీచర్స్ ట్రైనింగ్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వంక అన్నారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, జిల్లా లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు సీహెచ్ కృష్ణంరాజు, డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) పాల్గొన్నారు.

29న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రావణ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటుచేశామని డిపో మేనేజర్ బి.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బస్సు సర్వీసు ఈనెల 29న బయలుదేరి 30న ఉదయం శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురంలో భక్తులకు దర్శన సౌకర్యం కల్పించి సాయంత్రానికి అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. అరుణాచలంలో 31న గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి బయలుదేరి కాంచీపురం కామాక్షి అమ్మవారి దర్శనం చేసుకుని ఏలూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఒకరికి రూ.3 వేలు బస్సు చార్జీగా నిర్ణయించామని పేర్కొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

సాక్షి, భీమవరం: పాఠశాల నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించిన ఆచంట మండలం వల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నక్కా శామ్యూల్‌ను ఈనెల 18న విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శామ్యూల్ పాఠశాల విద్యార్థులను కొట్టినట్లు వచ్చిన ఆరోపణలపై ఎంఈఓ ప్రాథమిక విచారణ ఆధారంగా సస్పెండ్ చేసినట్లు డీఈఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'నవోదయ' దరఖాస్తుల గడువు పెంపు

సాక్షి, భీమవరం: జవహర్ నవోదయ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 20న నిర్వహించే పరీక్షకు ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో చేరడానికి అవకాశముంటుందని తెలిపారు.

స్కానింగ్‌లకు ప్రభుత్వ సాయం

భీమవరం(ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా నూతనంగా రెండు ప్యాకేజీలను తల్లీబిడ్డ ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెట్టిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే గర్భిణులకు ఐదో నెలలో స్కానింగ్‌కు రూ.250 జేఎస్ఎస్‌కే నుంచి, ఆరోగ్యశ్రీ నుంచి రూ.850 మొత్తం రూ.1,100 మొత్తాన్ని టిఫ్ఫా స్కానింగ్ నిమిత్తం ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. సాధారణంగా గర్భం ధరించిన తొలినాళ్లలో, కాన్పునకు ముందు చేసే యూఎస్‌జీ స్కానింగ్‌లకు ఇవి అదనమని తెలిపారు.

శాశ్వత లోక్‌అదాలత్‌తో సత్వర పరిష్కారం

ఏలూరు (టూటౌన్): సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజాప్రయోజనాల సేవల శాశ్వత లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని చైర్మన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో జిల్లా ప్రజాప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్‌పై శనివారం ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయపరంగా ఉచితంగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌లో 10 రకాల సమస్యలకు సంబంధించిన కేసులను స్వీకరిస్తామని, వీటిలో రవాణా, తపాలా, టెలిఫోన్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆస్పత్రి, బీమా, విద్యా, విద్యాసంస్థల సమస్యలు, గృహాలు, రియల్ ఎస్టేట్, బ్యాంకు, ప్రైవేట్ ఫైనాన్స్ తదితర ప్రభుత్వ సేవలు పరిష్కరించుకోవచ్చునన్నారు. డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ రెవెన్యూపరంగా సమస్యలుంటే మండలాల్లోని తహసీల్దార్ల ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు కె.చంద్ర శేఖర్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ బాపిరాజు, ఎల్‌డీఎం నీలాద్రి, అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ఏలూరు(మెట్రో): విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించి ఆధార్ నమోదు చేస్తున్నామని గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి రమణ తెలిపారు. స్థానిక తంగెళ్ల మూడినిలోని మిషనరీస్ ఆఫ్ చారిటీ, మదర్ థెరిసా డిజేబిల్డ్ చిల్డ్రన్ ఆశ్రమంలో శనివారం ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసిన 40 మందికి పైగా విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలయ్యేందుకు సచివాలయ సిబ్బంది సహకారంతో క్యాంపులు ఏర్పాటుచేశామని రమణ అన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసీల ద్వారా ప్రజల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసా ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పలువురికి ప్రభుత్వం నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి కొట్టు చేతులమీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అప్పారావుపేట వద్ద ట్రాక్టర్ తిరగబడటంతో ఇద్దరు కూలీలు మృతి చెందగా వారి కుటుంబాలకు సీఎం జగన్ రూ.5 లక్షల చొప్పున చెక్కులు మంజూరు చేశారన్నారు. అలాగే నియోజకవర్గంలో నలుగురు వ్యక్తులకు వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులను ఆధునీకరించడంతో పాటు వైద్యులను పూర్తిస్థాయిలో నియమిస్తున్నారని చెప్పారు. పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రజలకు చేరువచేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అనంతరం ఆకుమర్తి వెంకటేశులు, పాకా జాలరి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున చెక్కులను, స్థానిక 29 వార్డుకు చెందిన తాళ్ల ప్రసాద్ మనుమరాలికి వైద్య ఖర్చు నిమిత్తం రూ.6 లక్షలు, ఇటికులగుంటకు చెందిన మాగంటి సత్యనారాయణకు రూ.90 వేలు, దర్శిపర్రుకు చెందిన పంతం ధనలక్ష్మికి రూ.లక్ష, పేరిటాల వీరభద్ర బాపూజీకి రూ.2.30 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి కొట్టు అందజేశారు. కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, తహశీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, మార్లపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలి

కలెక్టర్ ప్రశాంతి

తణుకు టౌన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని జగనన్న కాలనీల్లో పూర్తయిన ఐదు లక్షల ఇళ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామర్లకోటలో ప్రారంభిస్తారని, అదేరోజు రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన 25 జిల్లాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్లను మంత్రులు ప్రారంభిస్తారని, వాటిలో పశ్చిమగోదావరి జిల్లాలోని దువ్వలో ఇళ్ల ప్రారంభోత్సవం కూడా ఉందన్నారు. ఈ మేరకు దువ్వలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను కోరారు. దువ్వ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.76 లక్షలు, స్వాగత ద్వారం నిర్మాణానికి రూ.6.70 లక్షలు, కల్వర్టుల నిర్మాణానికి రూ.23 లక్షలు, విద్యుద్దీకరణ పనులకు రూ.89 లక్షలు, మంచినీటి సరఫరా ఏర్పాటుకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే కాలనీలో విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మంచినీటి సరఫరాల పనులు, కల్వర్టుల నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. అంతర్గత రోడ్లు, స్వాగత ద్వారం పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పనులన్నీ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పూర్తయిన ఇళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ శాఖ ఈఈ బి.వెంకటరమణ, డీఈఈ కేకేడీటీ ప్రసాద్, ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఏఈ వెంకటరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దువ్వ జగనన్న కాలనీలో పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

వేగంగా ఓటర్ల సర్వే

తాడేపల్లిగూడెం: ఇంటింటా ఓటర్ల సర్వేను పక్కాగా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఇంటింటా సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, కంప్యూటర్ డేటాలను పరిశీలించారు. ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని ప్రాధాన్యత అంశంగా తీసుకొని ఈనెల 21లోపు పూర్తిచేయాలన్నారు. గడువు సమీపిస్తున్నందున ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతి ఓటరుకు ఇంటి నంబర్ సంఖ్య తప్పనిసరిగా వేయాలన్నారు. ఓటరు నమోదు చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించి పక్కా ఆధారాలను తీసుకోవాలన్నారు. ఒకే ఇంటిలో పదికి పైగా ఓట్లు ఉంటే ఓటర్లను పరిశీలించి తప్పులుంటే సరిదిద్దాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, తహసీల్దార్ దుర్గా కిషోర్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలని, జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 15 లోపు దరఖాస్తులు సమర్పించాలని ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువీకరణ పత్రాలు ఏలూరులోని తమ కార్యాలయంలో సెప్టెంబర్ 19లోపు సమర్పించాలని సూచించారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష వచ్చే డిసెంబర్ 3న జరుగుతుందని తెలిపారు. వివరాలకు ఏలూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

చినవెంకన్నకు బంగారు, వెండి వస్తువుల సమర్పణ



ఈఓకు బంగారు, వెండి వస్తువులను అందిస్తున్న దాత వేణుగోపాలరావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్నకు ఒక భక్తుడు శనివారం రూ.84 లక్షలు విలువైన బంగారు, వెండి వస్తువులను సమర్పించారు. విశాఖపట్నంకు చెందిన ఎం.వేణుగోపాలరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 1.397 కేజీల బరువైన బంగారు పంచ పాత్రలు, ఉద్ధరణిని, అలాగే 1.510 కేజీల బరువైన వెండి పళ్లెంను ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావుకు అందజేశారు. ఆలయ పండితులు దాత కుటుంబానికి వేద ఆశీర్వచనాన్ని, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

31 మందిపై కేసు నమోదు

టి.నరసాపురం: అటవీ శాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన నేరంపై 31 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ శనివారం చెప్పారు. ఈ నెల 17న అల్లంచర్ల అటవీ ప్రాంతంలోకి కామవరపుకోట మండలం జీలకర్రగూడెంకు చెందిన కొందరు అక్రమంగా ప్రవేశించి అడవిలో చెట్లను నరుకుతున్నారు. వీరు అటవీశాఖాధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో అటవీ శాఖ బీట్ అధికారి రాజు ఫిర్యాదు మేరకు బేతిన వెంకట్రావుతో పాటు మరో 30 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాండ్రంలో ఉద్రిక్తత

- ఇరువర్గాల పరస్పర దాడులు
- కొనసాగనున్న పోలీస్ పికెట్



వాండ్రంలో ఎస్సీలతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

ఉండి: వాండ్రంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు శుక్రవారం రాత్రి తారాస్థాయికి చేరుకున్నాయి. యువకుల మధ్య తగాదా చిలికిచిలికి వర్గపోరుగా మారింది. గురువారం, శుక్రవారం ఘర్షణలు జరగ్గా, శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన మూడు సామాజిక వర్గాలకు చెందిన సుమారు 300 మంది కర్రలు, రాడ్‌లతో దాడి చేసి లూథరన్ చర్చి అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ కె.శ్రీనాథ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ శనివారం గ్రామానికి చేరుకుని సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఇరుపక్షాల పెద్దలతో సమావేశమై పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. కొందరు ఎస్సీ నాయకులు ఈ సమావేశాన్ని అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేస్తేనే మిగిలిన వాటికి అంగీకరిస్తామని సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం గ్రామంలోని లూథరన్ చర్చి వద్ద ఎస్సీలు, పలు సంఘాల ఎస్సీ నాయకులు సమావేశం కాగా ఆర్డీఓ దాసి రాజు వారి వద్దకు వెళ్లి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే నమోదైన కేసుల్లో వ్యక్తులను అరెస్టులు చేయాలని ఎస్సీలు, ఎస్సీ నాయకులు పట్టుబట్టగా, దర్యాప్తు జరుగుతోందని చట్టాన్ని అతిక్రమించిన ఇరు వర్గాల్లోని వారిపై చర్యలు తీసుకుంటామంటూ ఆర్డీఓ తెలిపారు. శుక్రవారం రాత్రి ఘటనతో గ్రామంలో మరికొద్ది రోజుల పాటు పోలీస్ పికెట్‌ను కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. భీమవరం రూరల్ సీఐ అడబాల శ్రీనివాస్, ఎస్సైలు కె.గంగాధరరావు, మోహన్‌రావు, ఏజీఎస్ మూర్తి ఉండి, భీమవరం, పాలకోడేరు, మొగల్తూరు, కాళ్ల తదితర పోలీస్‌స్టేషన్‌ల ఏఎస్సైలు, సిబ్బంది, అలాగే స్పెషల్ పోలీస్ సిబ్బంది గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఇరువర్గాలపైనా కేసులు నమోదు

గ్రామంలో 17న సాయంత్రం వారాల పండుగ నిర్వహిస్తున్న సమయంలో ఎస్సీ ఏరియాకు చెందిన కోనాల భాగ్యరాజు, అనిల్, దావీదు అనే వారు ద్విచక్రవాహనంపై దురుసుగా రావడంతో స్థానిక పెద్దలు వారిని వారించి పంపించారు. దీంతో 18వ తేదీ రాత్రి నడివీధిలో పాలపర్తి రామకృష్ణ మరికొంత మంది ఉండగా 15 మంది ఎస్సీలు కర్రలతో రాగా పెద్దలు వారిని కూడా వారించి పంపించారు. తరువాత కొద్దిసేపటికి రామకృష్ణ అతని స్నేహితులు జగదీష్, దినేష్, సతీష్ విడివిడిగా గ్రామంలోని గుడికి వెళుతుండగా భాగ్యరాజు, దావీదు, వర్మ అనేవారు నలుగురు వ్యక్తులను కొట్టారు. దీంతో గాయపడిన సదరు వ్యక్తులు భీమవరం ఆసుపత్రిలో చేరడంతో ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే 17వ తేదీ రాత్రి 7 గంటలకు గ్రామంలో వారాల పండుగను చూసేందుకు కోనాల అఖిల్, అతని స్నేహితుడు దావీదు అనే ఇద్దరు ద్విచక్రవాహనంపై గ్రామంలోని నడివీధికి వెళ్లారు. వీరిని శ్రీనివాస్, కిట్టయ్య, సతీష్, దినేష్, జగదీష్, రాజేష్, సాంబ అనే ఏడుగురు వ్యక్తులు వారిని కులం పేరుతో దూషించి, కొట్టడమే కాక ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. దీనిపై ప్రశ్నించిన కోనాల భాగ్యరాజు, కిశోర్‌పై దాడి చేశారు. గాయాలపాలైన వారు భీమవరం ప్రభుత్వాసుత్రిలో చేరారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన తాడి నాగరాజు

తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటారు సైక్లిస్ట్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తణుకు పట్టణానికి చెందిన తాడి నాగరాజు (42) ఆటోకు సంబంధించిన సామగ్రి కొనుగోలు చేసేందుకు మోటార్‌సైకిల్‌పై ఏలూరు వెళ్లాడు. అనంతరం శుక్రవారం రాత్రి తిరిగి వెళుతుండగా, చినతాడేపల్లి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అదుపుతప్పి కింద పడిన నాగరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుని భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ హెడ్ కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) నాలుగో సెమిస్టర్ 2021–23 బ్యాచ్ విద్యార్థులు, అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు సెప్టెంబర్‌లో జరుగుతాయని, అభ్యర్థులు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 30వ తేదీ లోపు, రూ.50 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 7వ తేదీ లోగా ఫీజులు చెల్లించవచ్చన్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ అందుబాటులో ఉందన్నారు. సాధారణ అభ్యర్థులు రూ.250 పరీక్ష రుసుమును వెబ్ అప్లికేషన్ ఫారమ్ నింపే ప్రక్రియలో కనిపించే పేమెంట్ గేట్‌వే ద్వారా రెగ్యులర్, ప్రైవేట్ అభ్యర్థులు వేర్వేరుగా చెల్లించాలన్నారు. ప్రైవేట్, రెగ్యులర్ అభ్యర్థులు ఒక సబ్జెక్టుకు రూ.125, రెండు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.175, నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.250 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

స్కూల్ బస్సుకు తప్పిన ముప్పు



సీసలి వద్ద పంటకాలవ వైపు ఒరిగిన స్కూల్ బస్సు

కాళ్ల: సీసలిలో స్కూల్ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాళ్లలో ఓ ప్రైవేట్ స్కూలుకు చెందిన బస్సు శనివారం సాయంత్రం స్కూలు నుంచి చిన్నారులను ఇంటికి తీసుకువెళుతోంది. సీసలిలో పంటకాలువ వంతెన పైకి రాగానే బస్సు అదుపుతప్పి వంతెన గోడను ఢీకొట్టింది. గోడ ధ్వంసమై బస్సు సగంపైనే కాలువవైపు ఒరిగింది. దీంతో భయాందోళనకు గురైన చిన్నారులు కేకలు వేయడంతో స్థానికులు స్పందించి విద్యార్థులను జాగ్రత్తగా బస్సులోంచి కిందకి దించారు. ఘటన సమయంలో బస్సులో సుమారు 60 మంది చిన్నారులు ఉన్నట్లు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని పిల్లలను ఇంటికి తీసుకువెళ్లారు. బస్సు డ్రైవర్ మద్యం తాగి ఉండడాన్ని గమనించి తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కాళ్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సును స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాల నేరస్తులతో స్నేహభావంతో మెలగాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): జువైనల్ హోమ్‌లోని బాలలతో స్నేహభావంతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవన్‌లో జువైనల్ జస్టిస్ కమిటీ సభ్యులు, నోడల్ అధికారులతో నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జువైనల్ జస్టిస్ కమిటీ పనితీరు, ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కస్టడీలోకి తీసుకున్న బాలలతో స్నేహభావంతో ఎలా మెలగాలి, రిహాబిలిటేషన్ కల్పించడం మొదలైన అంశాల వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పోక్సో జడ్జి ఎస్.ఉమాసునంద, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల ఏఎస్పీలు, జ్యువనైల్ జస్టిస్ బోర్డు సభ్యులు, డీఈఓ, జిల్లా ప్రొబేషనరీ ఆఫీసర్, డీసీపీఓ, సీడబ్ల్యూసీ సభ్యులు, డీఎంఅండ్‌హెచ్ఓ, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానంతోనే భార్యను చంపేశాడు



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

ముసునూరు: చిల్లబోయినపల్లిలో మహిళ హత్య కేసులో నిందితుడైన భర్తను అరెస్ట్ చేసినట్లు నూజివీడు సీఐ ఆర్.అంకబాబు చెప్పారు. శనివారం విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. చిల్లబోయినపల్లికి చెందిన ఓలేటి రవీంద్ర భార్య నాగమణి (30) ఈ నెల 17న ఉదయం వరి పొలంలో కలుపు పనికి వట్లూరుకు ఆటోలో ఇతర కూలీలతో కలసి వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చినపుడు ఆటో వద్ద నుంచి ఆమెను భర్త రవీంద్ర బైక్‌పై ఇంటి వద్ద దించి బయటకు వెళ్లాడు. కొంతసేపటికి అతను ఇంటికి రాగా భార్య నాగమణి అదే గ్రామానికే చెందిన శ్రీను అనే వ్యక్తితో మాట్లాడుతూ కనిపించింది. రవీంద్రను చూసి శ్రీను పారిపోయాడు. గతంలోనే శ్రీను, నాగమణి మధ్య వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో రవీంద్ర ఉండగా, భార్య శ్రీనుతో మాట్లాడటంతో అతని కోపం తారాస్థాయికి చేరింది. వెంటనే ఆమెను జుట్టు పట్టుకుని లోనికి ఈడ్చుకెళ్లి గొడ్డలితో తలపై మూడు చోట్ల నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి రావడంతో నిందితుడు పారిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి, పరారీలో ఉన్న నిందితుని అరెస్ట్ చేసిన నూజివీడు రూరల్ సీఐ, ముసునూరు ఎస్సై ఎం.కుటుంబరావులను నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్ కుమార్‌గౌడ్ అభినందించారు.

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం 18వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వ్యక్తికి బ్రోచర్‌ను అందించి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

గుట్టు తెలిసిందని.. గొంతు కోశాడు



రక్తపు మడుగులో పడి ఉన్న సంధ్య మృతదేహం

- ప్రేమించి పెళ్లి చేసుకున్న వ్యక్తి దొంగ అని తెలిసి దూరం పెట్టిన భార్య
- విడాకులు కేసుపై ఆగ్రహిస్తూ అఘాయిత్యం.. చాకుతో గొంతు కోసి పరారీ



వి.సంధ్య (ఫైల్)

ఆకివీడు: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అతి కిరాతకంగా హతమార్చిన ఘటన ఆకివీడులో శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై సత్యసాయి తెలిపిన వివరాల ప్రకారం.. ఆకివీడుకు చెందిన మారడుగుల వీర వెంకట సత్యనారాయణ పెద్ద కుమార్తె సాయి లక్ష్మీ కమల సంధ్యను స్థానికంగా నివసించే వి.రాంబాబు అనే యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి 18 నెలల కుమారుడు ఉన్నాడు. కొద్దిరోజుల క్రితం రాంబాబు చైన్‌స్నాచింగ్ కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. అప్పటినుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో సంధ్య పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త ప్రవర్తన సరిగా లేకపోవడంతో విడాకుల కేసు పెట్టింది. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక భీమేశ్వరస్వామి ఆలయానికి తండ్రి సత్యనారాయణతో కలిసి వెళ్లింది. ఆలయం నుంచి బయటకు వచ్చిన సంధ్యను అప్పటికే కాపుకాసి ఉన్న రాంబాబు విచక్షణారహితంగా చాకుతో పొడవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి కేకలు వేస్తూ రక్తపు మడుగులో ఉన్న కుమార్తె వద్దకు వచ్చేసరికి రాంబాబు పరారయ్యాడు. గుడి నుంచి బయటకు వచ్చిన సంధ్యతో తనపై ఉన్న విడాకుల కేసును ఉపసంహరించుకోవాలని రాంబాబు చెప్పగా ఆమె నిరాకరించడంతో ఈ దారుణానికి పాల్పడ్డాడని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ శ్రీనాథ్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

మృతదేహంతో ధర్నా

సంధ్య హంతకుడిని కఠినంగా శిక్షించాలని సీపీఎం ఆధ్వర్యంలో మృతురాలి బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. డీఎస్పీ వచ్చే వరకూ ధర్నా కొనసాగించారు. రెండు గంటలకు పైగా ధర్నా చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి.

కొవ్వొత్తులతో ప్రదర్శన

సంధ్య ఆత్మకు శాంతి చేకూరాలని, సంధ్య కుటుంబానికి న్యాయం జరగాలని ఆకివీడు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం నుంచి ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్, ఎస్సైకి వినతిపత్రం అందజేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

త్వరలో ఎంఎస్ఎంఈ కార్యాలయాల ఏర్పాటు

ఆకివీడు: ఎంఎస్ఎంఈ కార్యాలయాలను త్వరలో భీమవరం, విజయవాడలో ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ ఎంఎస్ఎంఈ వైస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి పువ్వాడ రాజా అమర్‌నాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి తెలంగాణ రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు శనివారం ఆయన ఫోన్‌లో స్థానిక విలేకరులకు చెప్పారు. ఏపీ కార్యాలయం నెల్లూరులో ఉందని, త్వరలో ఎంఎస్ఎంఈ ద్వారా ఉపాధి కల్పించే పథకాలకు రుణాలు అందజేస్తామన్నారు. సెప్టెంబర్ నుంచి లబ్ధిదారులకు ఆయా యూనిట్లు అందజేస్తామన్నారు. యూనిట్లకు సంబంధించిన దరఖాస్తుల్ని లబ్ధిదారులు ఎంఎస్ఎంఈ కార్యాలయాలకు అందజేయాలన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జాతీయ చైర్మన్ విజయ్‌కుమార్, ప్రసాదరెడ్డి, వేణుగోపాల్, కార్మికవర్గ ప్రతినిధులు పాల్గొన్నారని అమర్‌నాథ్ చెప్పారు. ఈ సందర్భంగా తనకు తెలంగాణ కమిటీ ఘన సత్కారం చేసిందని తెలిపారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వర స్వామి వారికి శనివారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

పెదతాడేపల్లి గురుకుల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



తాడేపల్లిగూడెం పెదతాడేపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ సీహెచ్‌వో ప్రవల్లిక ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్, ఎత్తు, బరువు వంటి పరీక్షలు చేశారు. రక్తం తక్కువగా ఉన్న విద్యార్థులకు టాబ్లెట్లు పంపిణీ చేశారు. సుమారు 400మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్.ప్రసంగి, ప్రిన్సిపల్ బి.రాజారావు, ఏఎన్‌ఎం జి.పద్మ, కె.లక్ష్మి, ఎ.నవరత్నం, కే.రూపాదేవి, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాలో సత్తా చాటిన దండగర్ర విద్యార్థులు



జిల్లా స్థాయి యోగా పోటీల్లో సత్తా చాటిన దండగర్ర విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు యోగా జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటారు. సబ్ జూనియర్ విభాగంలో ఆకుల వెంకన్న బాబు (ప్రథమం), జూనియర్ విభాగంలో రుద్ర రాఘవ (ప్రథమ), సీనియర్ విభాగంలో చెరుకు వడ్డి కాసులు (తృతీయ స్థానం) విజయం సాధించారు. పురుషుల విభాగంలో పాఠశాల పీడీ చంద్రశేఖర్ ప్రథమ స్థానాన్ని సాధించారు.సెప్టెంబరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం సీహెచ్.చంద్రశేఖర్, పీడీ బీ.చంద్రశేఖర్ అభినందించారు.

ప్రత్యామ్నాయ ఉపాధి రంగంగా ఫొటోగ్రఫీ



జూబ్లీ రోడ్డులో డాగూరే జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రత్యామ్నాయ ఉపాధి రంగంగా ఫొటోగ్రఫీ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని ఫొటో, వీడియో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మరడాని పరశురామ్ (రాము) అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం పట్టణం జూబ్లీ రోడ్డులోని వాసవి డిజిటల్స్ వద్ద కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే జయంతిని నిర్వహించారు. తొలుత డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ జోసఫ్ నిప్సీ, టాల్ భట్, లూయిస్ డాగూరే కృషి ఫలితంగా నేడు కెమెరాపై ఆధారపడి ఎంతో మంది జీవనం సాగిస్తున్నారన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొడమంచిలి ఆశీర్వాదరావు, మహ్మద్ షబ్బీర్‌లు మాట్లాడుతూ యువ ఫొటో, వీడియోగ్రాఫర్లు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని, ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలను అవగాహన చేసుకుని, వృత్తి విలువలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ముళ్ళపూడి చిరంజీవి, కార్యదర్శులు సురేష్, ఆమంచి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు బివి.రమణ, సభ్యులు పాలడుగుల సతీష్, వి.విజయరంగన్, ఆమంచి నాని, అడ్డగర్ల పుల్లారావు, కె.శ్యామ్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

సేవకు చిరునామాలు...సచివాలయాలు

- సచివాలయాల ముంగిటకే సంక్షేమం
- అర్హులకు పథకాల లబ్ధి
- పలు గ్రామాల్లో సచివాలయల నిర్మాణాలు పూర్తి



దర్శిపర్రులో సచివాలయం

పెంటపాడు: ప్రజలకు ప్రభుత్వ పాలన చేరువ అయ్యింది. సచివాలయాల ముంగిటకే సంక్షేమ రాజ్యం వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులు అందరికి పథకాల లబ్ధి అందుతోంది. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతీ రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి 572 పౌరసేవలను అందించేందుకు 11 మంది సచివాలయ ఉద్యోగులను అందుబాటులో ఉంచారు. గ్రామ స్థాయిలో ఏ అవసరం వచ్చినా సచివాలయంలోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. మండలంలో ఏర్పడ్డ 20 సచివాలయాల ద్వారా ప్రజలకు వివిధ పథకాలు అందుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఇప్పటికే సచివాలయాలకు పక్కా భవనాలు నిర్మించారు. కొన్ని సచివాలయాల ద్వారా ప్రజలు సేవలు అందుతున్నాయి. ఈ వ్యవస్థకు అనుగుణంగా ప్రతీ 50 కుటుంబాలకు ఓ వలంటీర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో వలంటీర్లు సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి వర్తింప జేసేందుకు సహరిస్తున్నారు. ప్రతీ నెలా ఒకటోతేదీన పింఛన్ సొమ్మునేరుగా ఇంటివద్దే అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల పథకాలను ఇంటింటికి అందించే విధంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారు. అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా, చేదోడు, కాపునేస్తం, నేతన్ననేస్తం, పింఛన్‌కానుక, పంటల బీమా తదితర పథకాలను అందిస్తున్నారు. ఇవీ కాక పౌరసేవలో భాగంగా జనన, మరణ ధ్రువపత్రాలు, భూసంబంధ మ్యూటేషన్‌లు, పీఎం కిసాన్ పథకం, పేదలందరికీ ఇళ్లు, రేషన్‌కార్డుల్లో మార్పులు, తదితర సేవలను అందిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకాల కోసం నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. నేడు అర్హతలు ఉంటే చాలు. సంక్షేమ పథకాలు ఇంటి తలుపుతట్టి మరీ ఇస్తున్నారు. కాగా ఈ సేవలను అన్ని వర్గాల ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

ఆర్థిక పరిస్థితి మెరుగు



నా పేరు చింతా జయకుమారి. గత నాలుగేళ్లుగా పింఛన్ పథకం, చేయూత పథకంతో పాటు, ఇతర ప్రభుత్వ ధ్రువపత్రాలు అందాయి. సుమారు రూ.1,72,270లు సొమ్ము పలు పర్యాయాలు అందింది. ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– చింతా జయకుమారి, రాచర్ల

జగనన్నకు రుణపడి ఉంటాం



నాపేరు సీహెచ్ ప్రేమ్‌కుమారి. నాకు అమ్మఒడి అందుతోంది. గత ప్రభుత్వంలో పథకాల కోసం నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లగిలే తిరిగినా ఫలితం లేదు. దీంతో పాటు ఇప్పటివరకు పలు పథకాల కింద రూ.5,500 సొమ్ము అందింది. తమ కుటుంబం జగనన్నకు రుణపడి ఉంటాం.

– సిహెచ్. ప్రేమకుమారి, రాచర్ల

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

ఇరగవరం: మండలంలోని కావలిపురం సర్పంచ్ పదవికి, గోటేరు వార్డు మెంబర్‌కి జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కావలిపురంలో మొత్తం 2290 మంది ఓటర్లు ఉండగా 1770 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.29శాతం ఓట్లు పోలైయ్యాయి. అందులో పురుషులు 840 మంది, స్త్రీలు 930 మంది ఓటు వేయడం జరిగింది. టీడీపీ బలపరిచిన అభ్యర్థి వనచర్ల అప్పల స్వామికి 949ఓట్లు రాగా వైఎస్సార్ సీపీ బలపరిచిన వనచర్ల సత్యవేణికి 785 నోటకి 21 ఓట్లు రాగా 15 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో టీడీపీ బలపరిచిన వనచర్ల అప్పల స్వామి సమీప వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి వనచర్ల సత్యవేణిపై 164 ఓట్లు మెజార్టీతో గెలుపొందడం జరిగింది. ఆయనకి రిటర్నింగ్ అధికారి ఎస్ శ్రీనివాస్ ధ్రువీకరణ పత్రం అందించారు. గోటేరు 5వ వార్డుకి జరిగిన ఉప ఎన్నికలో ముగ్గురు మహిళలు పోటీ పడ్డారు. మొత్తం 184 ఓట్లు ఉండగా అందులో 145ఓట్లు సమోదయ్యాయి. పురుషులు 65 మంది, స్త్రీలు 80 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి మెంటే రాధకి 60 ఓట్లు, జనసేన బలపరిచిన అభ్యర్థి తోట ధనలక్ష్మికి 43 ఓట్లు, టిడీపీ బలపరిచిన అభ్యర్థి కోరిపూరి వెంకట లక్ష్మికి 38 ఓట్లు వచ్చాయి. 4 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెంటే రాధ 17 ఓట్లు మెజార్టీతో సమీప జనసేన అభ్యర్థి పై తోట ధనలక్ష్మిపై గెలుపొందడం జరిగింది రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రం అందించారు. పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తేతలి 8వ వార్డు సభ్యునిగా కోట దుర్గారావు గెలుపు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ పంచాయతీ 8వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ బలపర్చిన కోట దుర్గారావు విజయం సాధించారు. శనివారం నిర్వహించిన ఉప ఎన్నిక పోలింగ్‌లో వార్డులోని మొత్తం 467 ఓట్లకు గాను 425 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీ మురళీ సత్యనారాయణ తెలిపారు. అనంతరం దుర్గారావును గ్రామ సర్పంచ్ సరెళ్ల కాంతిప్రియ, ఇతర నాయకులు అభినందించారు.

మండలంలో ఒకవార్డుకు ఎన్నిక

పెంటపాడు: మండలంలో రెండు వార్డు సభ్యుల ఉపఎన్నికల్లో భాగంగా గతంలో చింతపల్లి గ్రామంలో 1వ వార్డుకు సంబంధించి చీపుళ్ల కల్యాణి అభ్యర్థి నామినేషన్ వేయడంతో అక్కడ ఏకగ్రీవం అయ్యింది. కె. పెంటపాడులో 5 వార్డుకు సంబంధించి శనివారం పోలింగ్ నిర్వహించగా కాకి రామకృష్ణవేణికి 168 ఓట్లు రాగా, సమీప అభ్యర్థి కొట్టే గోపాలలక్ష్మికి 40 ఓట్లు వచ్చాయి. ఈ వార్డులో 211 ఓట్లకు గాను రెండు ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. మరో ఓటు నోటాకు పడినట్లు ఎన్నికల అధికారి ఉన్నమట్ల నవీన్ తెలిపారు. కె.పెంటపాడు ఎన్నికలో ఎంపీడీవో బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఎంఈవో ఎం. శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ ఉన్నమట్ల నవీన్, హౌసింగ్ వర్కు ఇనస్పెక్టర్ జయరాజు తదితరులు ఎన్నికల డ్యూటీలో పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామమోహన్‌రావు, కార్యదర్శి సీహెచ్ జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబులు వెల్లడించారు. అవసరమైన పేద వారికి ఉచితంగా కళ్లజోడ్లు అందించడం, ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేస్తారని, పట్టణ ప్రజలు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థినులు ఎంపిక



జిల్లా స్థాయి యోగా సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థినీలను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా సెలక్షన్స్‌లో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈనెల 18వ తేదీన నిడదవోలు రోటరీ క్లబ్‌లో జరిగిన ఈపోటీల్లో తమ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. ఈపోటీల్లో ఎంపికైన విద్యార్థినీలు వచ్చే నెల 9,10 తేదీలలో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు, యోగా అధ్యాపకులు జీ అబ్బులు చౌదరి, పీడీలు ఎం రత్నకుమారి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గంగాధర్

తాడేపల్లిగూడెం (టీటీసీ): మద్యం, మాదకద్రవ్యాల వైపు కౌమారదశలో ఉన్న విద్యార్థులు ఆకర్షితులు కావద్దని దేవి ఎడ్యూకేషనల్ సొసైటీ సైకాలజిస్ట్ టి.గంగాధర్ అన్నారు. పట్టణంలో శనివారం సొసైటీ వారి ఆధ్వర్యంలో మునిసిపల్ సుబ్బారావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం సీపీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ సహకారంతో సీపీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా విద్యార్థుల కోసం ఎన్నో అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల నష్టాలను వెల్లడించారు. సిబ్బంది హరిప్రకాశ్, ధీరజ్‌లు మాట్లాడుతూ యువతను వ్యసనాల నుంచి విముక్తులు చేసేందుకు పీర్ ఎడ్యూకేటర్స్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు. సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక రహిత పంటలు పండించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఎరువులు, పురుగుమందులు వినియోగించని పంటలు పండించాలని ప్రకృతి వ్యవసాయం జోనల్ కోఆర్డినేటర్ గద్దె వెంకటరత్నం అన్నారు. శనివారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల భూమి సహజత్వాన్ని కోల్పోతుందన్నారు. పంటలకు మేలు చేసే ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుందన్నారు. తద్వారా ఖర్చులను తగ్గించుకోవచ్చన్నారు. పంటలను ఆశించిన చీడపీడలను జీవామృతం, బీజామృతం వంటి ద్రావణాలు వినియోగించి నివారించవచ్చన్నారు. అనంతరం రైతులకు వేప పిండి, లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతా వెంకట్రావు, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌ఛార్జ్ వై.లక్ష్మి, ఐసీఆర్‌పీలు డి.అరుణ, దుర్గాభవాని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- గూడెం 18వ వార్డులో కొనసాగిన గడపగడపకూ..



18వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కోరారు. గూడెంలో 18వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి చంద్రబాబునాయుడు 70 ఏళ్ల వయసులో అధికారంపై దాహం తీరక తహతహలాడుతున్నాడని విమర్శించారు. తెదేపా దొంగల పార్టీ అని ఎద్దేవా చేశారు. తెదేపా అధికారంలోకి రాదని తెలిసి బూటకపు హామీలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. 2019 ఎన్నికల కంటే జగన్‌కు మరింత ప్రజాదరణ పెరిగిందన్నారు.

18వార్డులో 35 లక్షలతో రోడ్లు, డ్రైయిన్లు నిర్మాణం

18వ వార్డులో రూ. 35 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణీకరణ చేస్తున్నట్లు చెప్పారు. విస్తరిస్తున్న ప్రాంతాల్లో తాళ్ల ముదునూరుపాడు ఉందన్నారు. పెంటపాడు మిడ్‌లెవెల్ కెనాల్ నుంచి పట్టణం వైపునకు తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఉండగా నాలుగు లైన్ల రోడ్డును బీడీ రోడ్లుగా విస్తరించామన్నారు. రెండవసారి ఎమ్మెల్యేగా ఉండటంతో వాటిని సీసీ రోడ్లుగా నిర్మించామన్నారు. రూ. 45 కోట్లుతో ఈ ప్రాంతం నుంచి వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ హార్టీ కల్చర్ యూనివర్శిటీ వరకు నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేశామన్నారు. మధ్యలో వచ్చిన ప్రజాప్రతినిదులందరూ అభివృద్ధికి చేతులెత్తేసారని ఆరోపించారు. జగనన్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, బోశం రామలక్ష్మి, మానికొండ వెంకటేశ్వరరావు, సంపత్‌రావు కృష్ణారావు, మేడపాటి జనార్దన రెడ్డి, ద్వారంపూడి కిరణ్‌రెడ్డి , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే అనర్థమే



ఉద్యానవర్సిటీలో సీనియర్ సివిల్‌జడ్జి కె.ప్రకాష్‌బాబుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ర్యాగింగ్ చేస్తే అనర్థాలు వస్తాయని, విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారుతుందని, తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు చెప్పారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శనంలో ర్యాగింగ్ రహిత వాతావరణం ఉద్యాన కళాశాలలో ఉండాలనే దృక్పథంతో శనివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సివిల్‌జడ్జి ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా ఉన్న చట్టాల్లో చిక్కుకొని ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాలో విశదీకరించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. విద్యార్థులతో ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఉద్యాన కళాశాల ఇన్‌చార్జి అసోసియేటింగ్ డీన్ సలోమి సునీత, న్యాయవాది ఆర్‌వీఎస్.సోమేశ్వరరావు, ఉద్యాన కళాశాల ఆచార్యులు డాక్టర్ ఇమ్మానుయేల్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ ఉమాకృష్ణ, డాక్టర్ దివ్యలు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్ర కరపత్రాల పంపిణీ

సాక్షి, భీమవరం: రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అంటూ సీపీఐ చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని భీమవరంలో శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ సమితి కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన తణుకు నిర్వహించే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బంగారు శివ, దుర్గారావు, సత్యనారాయణ, నీలపు శ్రీను, కిల్లరి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో జరభద్రం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



కొండేపాడులో స్కూల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యసిబ్బంది

పెంటపాడు: వర్షాకాలం... ఎక్కడ చూసినా చిత్తడిగానే కనిపిస్తుంది. పైగా లోతట్టు ప్రాంతాలు, ఖాళీస్థలాల్లో మురుగునీరు చేరి అపరిశుభ్రత చోటు చేసుకుంటుంది. దీంతో దోమలు వృద్ధి చెందడమే కాకుండా తాగునీరు కూడా కలుషితమయ్యే పరిస్థితులు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ, తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అందుకే ప్రజలు పరిసరాల శుభ్రతతో పాటు, సురక్షితమైన తాగునీరు తాగడం , దోమ తెరలు వాడటం, తదితర ముందు జాగ్రత్తలు తీసుకొంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని వైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతే శ్రీరామరక్ష:

దోమల వ్యాప్తి కారణంగా మలేరియా, బోధకాలు, డెంగీ, చికెన్‌గున్యా, తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఇంట్లోను నీరు నిల్వలేకుండా చూసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో దోమలు గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. నీరు నిల్వచేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, సంపులు, పాడేసిన కొబ్బరిబొండాలు, ప్లవర్‌వాజ్‌లు, రుబ్బురోళ్లు, వాటర్‌ట్యాంకుల్లో దోమల లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని సూచిస్తోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజన్‌లతో నిమిత్తం లేకుండా డ్రైడేపై అవగాహన కల్పిస్తున్నారు.

అప్రమత్తమైన యంత్రాంగం:

గ్రామాల్లో జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలు ఉన్న వారందరి రక్తాన్ని సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఫ్యామిలీ మెడికల్ ప్రోగ్రాంలో భాగంగా కూడా ఇంటింటికి డాక్టర్లు రావడంతో అక్కడిక్కడే రోగులు పరీక్షలు చేయించుకొని మందులు వాడుతున్నారు. జ్వరాలు నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకొంటున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు సిబ్బంది ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్య పనులపై పంచాయతీ, ఆరోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే కచ్చితంగా పాటించాలి



వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి ఆహారమే తీసుకోవడం, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం తదితర జాగ్రత్తలు అవసరం. దీంతో పాటు ప్రజలంతా ప్రతీ శుక్రవారం డ్రై డే కచ్చితంగా పాటించాలి. పంచాయతీలు కూడా కచ్చితంగా వాటర్ ట్యాంకుల శుభ్రత చేసుకోవాలి. నీటి పరీక్షలు చేయించాలి. ప్రజలకు జ్వరాలు ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీలో సిద్ధంగా ఉన్నాయి.

– ఎన్వీ రమణ, ముదునూరు ప్రాథమిక వైద్యాధికారి

ఓటర్ల జాబితా పరిశీలనను వేగవంతం చేయండి

ఉండి: ఓటర్ల జాబితా పరిశీలనను వేగవంతం చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీకే మల్లికార్జునరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఉండిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లతో ఓటర్ల జాబితా పరిశీలనపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 86 శాతం ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే పూర్తయ్యిందని తెలిపారు. ఈనెల 21 నాటికి నూరుశాతం పూర్తి చేయాలని, పూర్తి చేయని వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. బీఎల్‌వోల డైరీని తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఓటర్ల సర్వేలో అధికారులు ఎటువంటి ఒత్తిళ్ళకు లొంగకూడదన్నారు. సమావేశానికి తహసీల్దార్లు ఎస్.విజయలక్ష్మి, ఏఎస్ వీరాస్వామి నాయుడు, ఎ.కృష్ణారావు, ఎస్‌కే హుస్సేన్, ఎంపీడీవోలు జి.స్వాతి, కె.వాణి, ఏవీ అప్పారావు, ఎంఎస్ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.